# సత్యవాక్కు

పోస్టు బాక్స్ - 80, కాకినాడ
ఆంధ్రప్రదేశ్ - 533 001.
ఫోన్ : 0884-2363722, సెల్ : 98489 98547
ఎడిటర్: జాషువా గూటం

క్రొత్త నిబంధన క్రైస్తవ పునరుద్ధరణ కొరకు

సంపుటి - 43 | మార్చి - 2022 | సంచిక -8


## దేవుని శుభవార్త - 1

రోమాలోయున్న క్రైస్తవులకు అపొ.పౌలు ఇట్లు వ్రాసెను : "గ్రీసు దేశస్థులకును, గ్రీసుదేశస్తులు కాని వారికిని, జ్ఞానులకును, మూఢులకును నేను ఋణస్తుడను. కాగా నావలనై నంతమట్టుకు రోమాలోని మీకును సువార్త ప్రకటించుటకు సిద్ధముగా ఉన్నాను. సువార్తను గూర్చి నేను సిగ్గు పడువాడను కాను, ఏలయనగా నమ్ము ప్రతివానికి మొదట యూదునికి, గ్రీసు దేశస్తునికి కూడ రక్షణ కలుగుజేయు టకు అది దేవుని శక్తియై యున్నది" (రోమా 1:14-16).

సువార్తయను పదము ఒక పురాతన పదము. సువార్త యనగా మంచివార్త లేక శుభవార్తయని అర్థము. నీవీమధ్య ఏదైనా మంచి వార్తను విన్నావా? మనదేశ పరిస్థితిలో రాజకీయముగా గాని, ఆర్థికముగా గాని, సాంఘికముగా గాని నీవు ఈ మధ్య ఏదైనా మంచి వార్తను విన్నావా? లేక నేటి అంతర్జాతీయ పరిస్థితి ఎట్లున్నది? నిజానికి ప్రతి దినము వార్తలను రేడియోలోను, టి.వి.లోను వింటుంటే లేక పత్రికలలో చదువుచూ యుంటే మనకు దొరికే మంచివార్త ఏమియునులేదు. అయితే మానవ జాతిని ఆవరించుకొనిన

పాపభరిత మైన కారుమేఘములలో నుండి సువార్త కిరణములు ప్రకాశించుచు వచ్చుచునే యున్నవి. గనుక ఈ రోజు మీకు మంచివార్తను, క్రీస్తును గూర్చిన శుభవార్తను వినగలుగుచున్నావు.

సువార్తయనగా క్రీస్తును గూర్చియు, దేవుని రాజ్యమును గూర్చియు, రక్షణ గూర్చియు మంచి వర్తమానమని నిర్వచించబడినది. రోమా 10:15లో బైబిలు సువార్తయను పదమును మనకు వివరించుచున్నది. "ఉత్తమమైన వాటిని గూర్చిన సువార్త ప్రకటించువారి పాదములెంతో సుందరమైనవి" యని అది చెప్పు చున్నది. ఉత్తమమైన వాటిని గూర్చి యున్న సువార్త! దీనిని ఆలోచించుము. సువార్తను మనము ధ్యానించుట బహు ముఖములు గల ఒక వజ్రమును వీక్షించుటతో సమానముగా యుండును.

మొదటిగా సువార్త దేవుని వలన నైనది యని లేఖనములు బోధించు చున్నవి. థెస్సలోనికయలోని క్రైస్తవు లకు పౌలు వ్రాయుచు, "సహోదరు లారా, మీ యొద్ద మా ప్రవేశము వ్యర్థముకాలేదు గాని, మీరెరిగినట్లే మేము ఫిలిప్పీలో ముందు శ్రమపడి అవమానము పొంది, యెంతో పోరాటముతో దేవుని సువార్తను మీకు బోధించుటకై మన దేవుని యందు ధైర్యము తెచ్చుకొంటిమని మీకు తెలియును" (2థెస్స 2:1,2). ఇక్కడ సువార్తను పౌలు దేవుని సువార్తయని చెప్పుచున్నాడు.

ఉత్తమమైన వాటిని గూర్చిన ఈ సువర్తమానము దేవునితో ఆరంభమా యెను. నిజానికి దేవుడు దానికి కర్త. ఈ సువార్త ప్రత్యేకమైనది ఏలయనగా అది సర్వశక్తివంతుడైన దేవుని యొద్దనుండి వచ్చినది. అది మానవులను పాపము నుండి రక్షించును గనుక అది ప్రశస్తమైన వర్తమానము. అందువలననే దేవుని సువార్తను ధైర్యముతో ప్రకటించితి మని పౌలు థెస్సలోనికయలోని క్రైస్తవులకు జ్ఞాపకము చేసెను. దేవుని నుండి కలిగిన వర్తమానమును బోధించువాడు నిజానికి ధైర్యముగనే

దానిని బోధించునర్హత గలవాడు.

అంతేకాకుండా ఈ దేవుని వర్త మానమును పౌలు ఎంతో పోరాటముతో బోధించెను. పౌలు థెస్సలోనికయలో సువార్తను బోధించుచున్నప్పుడు కొందరు దానిని ఎదురాడిరి, మరి కొందరు తిరస్కరించిరియని అపో.కా. 17వ అధ్యాయములో మనము చూడగలము. నిజానికి పౌలును, అతని సహచరులును భూలోకమును తల క్రిందుచేసిరని వారిపై నేరారోపణను ఆ పట్టణస్థులు చేసిరి (అపో.కా. 17:6). పౌలు కాలములో యున్న ప్రపంచ పరిస్థితిని మనమెరిగి యున్న యెడల ఆనాడేమి అవుసరమైయున్నదో దానినే పౌలు చేయుచున్నాడని మనము తెలిసి కొనగలము. నాటి లోకము సరిచేయబడవలెనన్న అది తల క్రిందులు చేయబడవలసియున్నది.

**పౌలు కాలములోయున్న లోకము యెట్లుండెను?** మానవుడు తోటిమానవునికి చేయు అమానుష క్రియలు - నరహత్య, వ్యభిచారము, జారత్వము, కామము, దురాశ మొదలగునవన్నియు ఆనాడు ప్రబలి యున్నవి. మొదట శతాబ్దములోని ప్రజలు దేవుని, ఆయన చిత్తమును తిరస్కరించు సమస్త విధమైన అవినీతికి పాల్పడిరి. ప్రజలు తమ సహజ ప్రేమను విడనాడిరి. తల్లులు పిల్లలను విడనాడిరి. భార్యలు తమ భర్తలను, గృహములను విడనాడిరి, భర్తలు తమ భార్య, పిల్లలను విడనాడిరి, యౌవనులు తమ తలిదండ్రులను గౌరవించుట మానుకొనిరి, మరికొందరు వారిక విధేయులైరి. పౌలు కాలమునాటి లోకములోయున్న అనేక సమస్యలలో యివి కొన్నిమాత్రమే. కాముకత్వముతో గాని లేక మానవకల్పిత వేదాంతముతోగాని తమ హృదయములను నింపుకొనినవారు, పౌలు దేవుని నుండి కలిగిన వర్తమానమును బోధించుచున్నాడని, నాటి లోకమునకేమి అవుసరమైయుండెనో దానినే అతడు చేయుచుండెనని వారు గ్రహించగలిగిరి. నిజానికి పౌలు వారికి శుభవర్తమానమును అందించుచుండెను!

మొదటి శతాబ్దపు ప్రపంచము ఎట్లున్నదో మీరు ఇంకను తెలిసికొన గోరుచున్నయెడల ఈ దిగువ లేఖన ములను జాగ్రత్తగా చదువండి: రోమా 1:21-32; 1కొరింథీ 6:9-11; కొలస్స 3:1-11 మరియు ఎఫెస్సీ 4: 17-32.

సువార్త దేవుని వలన కలిగినదని పౌలు మాత్రమే కాకుండా అపో. పేతురు కూడ అట్లే చెప్పుచున్నాడు. పేతురు వ్రాసిన మొదటి పత్రికలో "దేవుని సువార్తకు అవిధేయులైన వారి గతి యేమవును?" అని అతడడిగెను (1పేతురు 4:17). దేవుని నుండి కలిగిన వర్తమానమును బోధించుటలో కొంత ఉద్రేకము యిమిడి యున్నది. ఈ వర్తమానము లో భయంకరమైన సంగతికూడ కొంత యున్నది. దానిలో ఘనత, బాధ్యతలు కూడ యిమిడియున్నవి. సువార్తకు కర్తయైన దేవునికి ఘనతయు, దానిని వినుచున్న మానవునికి గొప్ప బాధ్యతయు దానిలో యున్నవి.

రెండవదిగా, ఈ సువార్తను గూర్చిన మరొక సత్యమున్న గమనింతుము, లేఖనములలో ఈ సువార్త క్రీస్తు సువార్తయని చెప్పబడి నది. దేవునితో ఈ మంచివర్తమానము ఆరంభమాయెను. గనుక, దేవుడే దానికి కర్త. గనుక అది దేవుని సువార్త, అయితే యీ మంచివర్తమానము క్రీస్తును గూర్చిన వర్తమానము గనుక అది క్రీస్తు సువార్త.

కొరింథీయులకు వ్రాసిన మొదటి పత్రికలో పౌలు క్రీస్తు సువార్తను గూర్చి వివరించెను. 15వ అధ్యాయములో పౌలు ఇట్లువ్రాసెను: "మరియు సహోదరులారా, నేను మీకు ప్రకటించిన సువార్త మీకు తెలియ పరచుచున్నాను. మీరు దానిని అంగీకరించితిరి, దానియందే నిలిచి యున్నారు... ఆ సువార్తవలనే మీరు రక్షణపొందువారై యున్నారు". ఇక్కడ రక్షణను సువార్తతో పౌలు కలుపు చున్నాడు. రక్షించునట్టి క్రీస్తు సువార్తనే అతడు వారికి ప్రకటించెను. కొరింథులో రక్షింపబడిరి. రక్షించునట్టి ఈ సువార్తను గూర్చి అపో. పౌలు

నుండి మరికొంత తెలిసికొందము. 1 కొరింథీ 15:3లో "నాకియ్యబడిన ఉపదేశమును మొదట మీకు అప్పగించితిని" యని అతడు చెప్పెను. పౌలు ప్రకటించిన సువార్త బయల్పరచబడిన సువార్త. అది పౌలుతో ఆరంభము కాలేదు. అది పౌలు యొక్క వ్యక్తిగత జీవిత సాక్ష్యము కాదు.

గలతీ 1:11, 12లో. "సహోదరులారా, నేను ప్రకటించిన సువార్త మనుష్యుని యోచనప్రకారమైనది కాదని మీకు తెలియజెప్పుచున్నాను. మనుష్యుని వలన దానిని నేను పొందలేదు, నాకెవడును దాని బోధించలేదు గాని యేసుక్రీస్తు బయలుపరచుట వలననే అది నాకు లభించెనని" యని అతడు ప్రకటించెను. ఈ రోజుల్లో అనేకమంది క్రొత్త నిబంధన గ్రంథములో వ్రాయబడిన సువార్తకు బదులు తమ వ్యక్తిగత జీవిత సాక్ష్యములనే ప్రకటించుట సిగ్గుకరము కాదా? ప్రభువు వారినెట్లు రక్షించాడో ఈ సాక్ష్యము చెప్పువారి నుండి నీవు గనుక వినినయెడల మనిషి కేవలరీతిగ ప్రభువు తన రక్షణ సంకల్పమును నెరవేర్చెనని నీవనుకొందువు. ప్రభువు యేర్పరచిన రక్షణ మార్గమును ఈ ఆధునిక సాక్షుల నుండి నీవేమియు తెలిసికొనలేవు: ఏలయనగా వారు క్రీస్తు సువార్తను గాక తమ సొంత జీవిత వర్తమానమునే ప్రకటింతురు.

**అయితే పౌలు ప్రకటించిన సువార్త క్రీస్తు సువార్త.** సువార్త యొక్క ముఖ్యాంశము క్రీస్తే గాని పౌలు కాదు. 1 కొరింథీ 15వ అధ్యాయములో సువార్తయనగా ఏమిటో అతడు మనకు ప్రత్యేకముగా చెప్పుచున్నాడు: "అదేమనగా, లేఖనముల ప్రకారము క్రీస్తు మన పాపములనిమిత్తము మృతిపొందెను, సమాధి చేయబడెను. లేఖనముల ప్రకారము మూడవ దినమున లేపబడెను". ఈ గొప్ప వచనములో దేవుని కుమారుడైన క్రీస్తు మనకొరకు చనిపోయెననుటయేగాక పాతనిబంధన లేఖనముల సర్వసత్యమంతయు ఇమిడియున్నది. మన రక్షకుడు ఎట్టి మరణమునొందున

పాత నిబంధన లేఖనములు ముందగనే చెప్పెను. ఆయన సమాధిని గూర్చి, పునరుత్థానమును గూర్చి పాత నిబంధనలో ముందగనే చెప్పబడెను. యేసుక్రీస్తు తన జీవితములోనే గాక, మరణ, సమాధి, పునరుత్థానములలో పాతనిబంధనను సంపూర్తిగ నెరవేర్చెను. అందువలననే లేఖనముల ప్రకారము క్రీస్తు మన పాపముల నిమిత్తము మృతిపొందెను, సమాధి చేయబడెను, మూడవ దినమున లేపబడెను అని పౌలు ప్రకటించెను. ఇది యేసుక్రీస్తు సువార్త. దీనిని నమ్మి బాప్తిస్మము పొందువాడు రక్షించ బడును. అందువలన పాపపు లోకమునకు యిది మంచివార్త. క్రీస్తు సువార్తను గూర్చి మరికొంత తరువాత సంచికలో తెలిసి కొందుము. గాని నీవు నీ పాపముల నుండి విడుదల పొందవలె నంటే, నిన్ను విడుదలచేసే శక్తి క్రీస్తు సువార్తలో యున్నదని తెలిసి కొనుము. ఏలయనగా నమ్ము ప్రతివానికి రక్షణ కలుగజేయుటకు అది దేవుని శక్తియై యున్నది. నీవు రక్షింపబడ గోరుచున్నావా?

## క్రీస్తును గూర్చి మీరేమనుకొనుచున్నారు?

మత్తయి 22:36-40లో యేసు ప్రధానమైన రెండు ఆజ్ఞలను గూర్చి చెప్పారు. నీ దేవుడైన యెహోవాను నీ పూర్ణాత్మతోను, పూర్ణమనస్సుతోను ప్రేమింపవలెననునది ప్రధాన మైనదియు, నిన్ను వలె నీ పొరుగు వానిని ప్రేమింపవలెననుది రెండవ దియునని ఆయన తెలియజేసారు. ఆయనను శోధించుచు పరిసయ్యు డొకడు ఆయనను ప్రశ్నింపగా ఆయన యిచ్చిన జవాబు అది. ఆయన అతనికి జవాబిచ్చి, పరిసయ్యులు కూడి యుండగా, "క్రీస్తును గూర్చి మీకేమి తోచుచున్నది? ఆయన ఎవని కుమారుడని వారినడిగెను" (మత్తయి 22:4; 42).

క్రొత్తనిబంధనను మనం చదువుచుండగా ప్రభువు వివిధ రకములైన మనుష్యులతో సంభా షించుచున్నట్లు గమనించగలము.

క్రీస్తును గూర్చి వారందరికి ఏదో ఒక అభిప్రాయము ఏర్పడి యుండ వచ్చును. అక్రమకారులైన మనుష్యుల చేత పరిసయ్యులు అబద్ధ సాక్ష్యము చెప్పించి వారు యేసుకు శిక్షపడే లాగున చూసారు (మార్కు 14:57, 58). యోగ్యులైన మంచిమనస్సు గల వారు క్రీస్తును గూర్చిన వారి యభిప్రాయములను తెలియజేసిన వారి మాటలను ఇప్పుడు కొంత పరిశీలించుదము.

**దూతలు :** కన్యయైన మరియ ఒక శిశువుకు జన్మనీయగా గొర్రెల కాపరులకు దూతలు, "దావీదు పట్టణ మందు నేడు రక్షకుడు మీకు పుట్టి యున్నాడు. ఈయన ప్రభువైన క్రీస్తు" అని తెలియజేసారు (లూకా 2:11).

**తండ్రియైన దేవుడు :** యొర్దాను నదిలో యేసు యోహానుచేత బాప్తిస్మము పొంది నీళ్లలో నుండి వెడలి రాగా, "ఇదిగో ఆకాశము తెరువ బడెను. దేవుని ఆత్మ పావురము వలె తన మీదికి దిగివచ్చుట చూచెను. మరియు ఇదిగో ఈయన నా ప్రియ కుమారుడు, ఈయన యందు నేనానందించు చున్నానని యొక శబ్దము ఆకాశము నుండి వచ్చెను" (మత్తయి 3:16, 17).

**బాప్తిస్మమిచ్చు యోహాను :** యేసు యొక్క దైవత్వాన్ని యోహాను గుర్తించాడు. అతడు తన శిష్యులతో, "ఇదిగో లోకపాపములను మోసికొను పోవు దేవుని గొర్రెపిల్ల" యని చెప్పెను (యోహాను 1:29).

**పేతురు :** తనను గూర్చి వారేమనుకొనుచున్నారని యేసు తన శిష్యులనడుగగా, పేతురు "నీవు సజీవుడగు దేవుని కుమారుడవైన క్రీస్తువు" అని ఒప్పుకొనెను (మత్తయి 16:16).

**దయ్యములు :** ఆయన యొక్క సర్వశక్తిని బట్టి యేసు అన్ని రకములైన వ్యాధులను బాగుచేసెను : దయ్యములు పట్టినవారి నుండి వాటిని వెళ్లగొట్టెను. "ఇంతేగాక దయ్యములు నీవు దేవుని కుమారుడవని కేకలు వేసి

అనేకులను విడిచిపోయెను" (లూకా 4:41).

**ఆయనను అప్పగించిన యూదా :** యేసు బంధింపబడుట చూచి, "నేను నిరపరాధ రక్తమును అప్పగించితినని ఒప్పుకొనెను (మత్తయి 27:4).

**పిలాతు :** యేసు అధిపతియైన పిలాతునొద్దకు తేబడగా అతడాయనను హేరోదు నొద్దకు పంపించెను. పిలాతు ప్రజలతో, "ఇదిగో నేను మీ యెదుట ఇతనిని విమర్శింపగా మీరతనిమీద మోపిన నేరములలో ఒక్కటైనను నాకు కనబడలేదనెను" (లూకా 23:14,15).

**పిలాతు యొక్క భార్య :** యేసును గూర్చి కలవరపడి కలగని ఆయన నీతిమంతుడని ఒప్పుకొనెను (మత్తయి 27:19).

**శతాధిపతి :** యేసు సిలువవేయ బడుటచూచి, తదుపరి సంభవించిన భూకంపమును బట్టియు, ప్రకృతిలో సంభవించిన వికృతములను బట్టియు, "నిజముగా ఈయన దేవుని కుమారుడని" ఒప్పుకొనెను (మత్తయి 27:54).

**తోమా :** యేసు మృతులలో నుండి తిరిగిలేచెనని మిగతా శిష్యులు చెప్పుచున్న మాటలను తోమా శంకిం చాడు. అయితే మేకులుకొట్ట బడిన ఆయన చేతులలోను, కాళ్లలోనుయున్న గాయములను అతడు స్వయముగా తాకి, "నా దేవా, నా ప్రభువా"యని అరచెను (యోహాను 20:28).

మనలను సత్యమును గూర్చి ఒప్పించడానికి ఎంతమంది సాక్షులు అవుసరము? యేసు యొక్క మిత్రులు, శత్రువులు, తటస్థముగా యున్నవారు కూడ అందరు యేసును గూర్చిన యదార్థ వాస్తవములను ఎదుర్కొన వలసి వచ్చినది. నజరేయుడైన యేసును గూర్చి వారు చెప్పిన మాటలను ఇంతవరకు పరికించాము.

ఈ వ్యాసమును చదువుచున్న నీకు కూడ పరిసయ్యులకు వేయబడిన ప్రశ్నయే వేయబడుచున్నది: "క్రీస్తును గూర్చి మీకేమి తోచుచున్నది? ఆయన ఎవని కుమారుడు?".

–చార్ల్స్ రోజ్

# క్రీస్తును వెంబడించితే గొప్ప యేమిటి?

జీవితం యొక్క నిజమైన సమాధానము మరియు సంతోష మును యేసు అనుగ్రహించును.

"ప్రయాసపడి భారము మోసి కొనుచున్న సమస్త జనులారా, నా యొద్దకు రండి, నేను మీకు విశ్రాంతి కలుగజేతును" అని యేసు వాగ్దానం చేసెను (మత్తయి 11:28). అలసిన వారికి నిజమైన విశ్రాంతి యేసులో యున్నది. ఉదాహరణ కోసం తీసికొనుము, ఐతియొపియా నుండి వచ్చిన మనుష్యుని ఉదాహరణ, అతడు క్రీస్తులోనికి బాప్తిస్మం పొందిన తరువాత సంతోషించెను (అపొ.కా. 8:36-39).

రక్షకుని సేవించువాడు తాను ప్రభువు చిత్తమును జరిగించుచున్నా ననియు, తన సృష్టికర్తకు గౌరవము చూపుచున్నాననియు, మరియు ఆయన ఆజ్ఞలను అనుసరించుచున్నా ననియు, అది మానవకోటికి విధి అని అతడు ఎరిగి సంతృప్తిని కలిగి యుండును (ప్రసంగి 12:13).

సమాధానకర్తయైన మనస్సు మరియు ఆనందముతో ప్రభువు మనతో ఉండుననియు మరియు ఆశీర్వదించునను విశ్వాసం వచ్చును. ఆయనకు మనం నమ్మకముగా ఉండినట్లయితే, అప్పుడు మన వాగ్దానములు నిజమగును. "నిన్ను ఏ మాత్రమును విడువను, నిన్ను ఎన్నడును ఎడబాయను" (హెబ్రీ 13:5). మరియు "అయితే ఆయన వెలుగులోనున్న ప్రకారము మనమును వెలుగులో నడిచినయెడల, మనము అన్యోన్యసహవాసము గలవారమై యుందుము: అప్పుడు ఆయన కుమారుడైన యేసురక్తము ప్రతి పాపము నుండి మనలను పవిత్రులను గా చేయును (1 యోహాను 1:7).

"వచ్చి చూడుడి" (యోహాను 1:39).

రోజర్ కేంప్‌బెల్

# సిలువ యేమి బయలు పరచుచున్నది?

హెబ్రీ 12:1, 2లో పౌలు ఇట్లు వ్రాసాడు: "ఇంత గొప్ప సాక్షి సమూహము మేఘమువలె మనలను ఆవరించి యున్నందున మనము కూడ ప్రతిభారమును, సుళువుగా చిక్కులబెట్టు పాపమును విడిచిపెట్టి విశ్వాసమునకు కర్తయు దాని కొనసాగించువాడునైన యేసువైపు చూచుచు మన ఎదుట ఉంచబడిన పందెములో ఓపికతో పరుగెత్తుదము, ఆయన తన యెదుట ఉంచబడిన ఆనందము కొరకై అవమానమును నిర్లక్ష్యపెట్టి సిలువను సహించి దేవుని సింహాసనము యొక్క కుడిపార్శ్వమున ఆశీనుడై యున్నాడు", మన జీవితంలో సిలువవైపు దృష్టించిన యెడల ఆ సిలువ నాలుగు ప్రాముఖ్య సంగతులను మనకు బయలు పరచుచున్నది.

**క్రీస్తు సిలువ పాపము యెడల దేవుని దృక్పథమును మనకు బయలు పరచుచున్నది.** పాపము ఒక అకస్మిక ఘటన యని మానవుడు అంటాడు, దేవుడు దానిని హేయమని పిలుస్తారు. పాపము ఒక పొరబాటు అని మానవుడు తలస్తాడు. దేవుడు దానిని అంధత్వమని యుంటారు. పాపము తప్పిదమని మానవుడు అంటాడు, దేవుడు అది బుద్ధిపూర్వక చర్యయని అంటారు. "పాపము చేయు ప్రతివాడును ఆజ్ఞనను అతిక్రమించును; ఆజ్ఞాతిక్రమమే పాపము" గనుక దేవుడు పాపమును ద్వేషిస్తారు (1 యోహాను 3:4). దురాశ గర్భము ధరించి పాపమును కనగా, పాపము పరిపక్వమై మరణమును కనును" గనుక దేవుడు పాపమును అసహ్యించుకొంటారు (యాకోబు 1:15). క్రీస్తు సిలువ ద్వారా పాపమును నాశనము చేయుట యే దేవుని ప్రణాళికయై యున్నది". అపవాది క్రియలను లయపర్చుటకే దేవుని కుమారుడు ప్రత్యక్షమాయెను" (1 యోహాను 3:8).

**మానవుని తత్వము క్రీస్తు సిలువ బయలుపరచు చున్నది:**

సిలువ సందర్భములో మానవుడు తన భక్తియనే ముసుకు తీసివేసి, నరకాగ్నితో అతని ఆత్మ ఎంత నిండియున్నదో తన్నుతాను బయలు పరచుకొన్నాడు. "వారు అసూయచేత ఆయనను అప్పగించిరని పిలాతు ఎరిగియుండెనని" మత్తయి 27:18 చెప్పుచున్నది. "అధిపతి ఎందుకు? ఇతడు ఏ దుష్కార్యము చేసెనని అడుగగా వారు సిలువ వేయుమని మరి ఎక్కువగా కేకలువేసిరి" (మత్తయి 27:23).

క్రీస్తును సిలువ వేయించిన ప్రజలను గూర్చి చెబుతు "దేవుడు నిశ్చయించిన సంకల్పమును ఆయన భవిష్యత్ జ్ఞానమును అనుసరించి అప్పగింప బడిన యీయనను మీరు దుష్టులచేత సిలువ వేయించి చంపితిరి'' యని పేతురు ఉద్ఘాటించాడు (అపొ.కా. 2: 23). "అందుకు ప్రజలందరు వాని రక్తము మా మీదను మా పిల్లల మీదను ఉండును గాక యని పలికిరి". ఈ మాటలు వారి ఘోరపాపతత్వ మును బయలు పరచుచున్నవి (మత్తయి 27:25). సిలువచుట్టు జరిగిన సందర్భములు మానవుని ఘోర స్థితిని దేవుని ఉచ్ఛస్థితిని మనకు బయలుపరచు చున్నవి.

**క్రీస్తు సిలువ దేవుని ప్రేమను బయలు పరచుచున్నది :** అవును సిలువలో దేవుని ఔన్నత్యము మనకు కనబడుచున్నది. "అయితే దేవుడు మన యెడల తన ప్రేమను వెల్లడి పరచుచున్నాడు; ఎట్లనగా మన మింకను పాపులమై యుండగానే క్రీస్తు మన కొరకు చనిపోయెను" (రోమా 5:8). "అయినను దేవుడు కరుణా సంపన్నుడై యుండి, మనము మన అపరాధములచేత చచ్చిన వారమై యుండినప్పుడు సయితము మన యెడల చూపిన తన మహా ప్రేమ చేత మనలను క్రీస్తుతో కూడ బ్రదికించెను" (ఎఫెసీ 2:4). దేవుని ప్రేమ నిత్యము వుండునట్టిది. "యెహోవా దయాళుడు, ఆయనకు కృతజ్ఞతాస్తుతులు చెల్లించుడి. ఆయన కృప నిరంతర ముండును" (కీర్తన 138:1). అందుకే "దేవుడు ప్రేమయై యున్నాడు" అని

1యోహాను 4:8 చెప్పుచున్నది.

**మానవుని నిరీక్షణ యదార్థము కాగలదని క్రీస్తు సిలువ బయలు పరచుచున్నది :** తన పాపములు క్షమించబడాలనే మానవుని నిరీక్షణ క్రీస్తు సిలువ వలన యదార్థమగును. "దేవుని కృపా మహదైశ్వర్యమును బట్టి ఆ ప్రియుని యందు ఆయన రక్తము వలన మనకు విమోచనము అనగా మన అపరాధములకు క్షమాపణ కలిగి యున్నది" యని ఎఫెసీ 1:7 చెప్పు చున్నది. దేవునితో సమాధానపరచ బడాలనే మానవుని నిరీక్షణ యదార్థము కాగలదు. "ఆయన సిలువ రక్తముచేత సంధిచేసి ఆయన ద్వారా సమస్తమును అవి భూలోకమందున్నవి యైనను, పరలోకమందున్నవైనను వాటినన్నిటిని ఆయన ద్వారా తనతో సమాధానపరచుకొనవలెననియు తండ్రి అభీష్టమాయెను" (కొలస్స 1:20). గనుక ఇప్పుడు మన "పౌర సత్వము పరలోకమందున్నది" (ఫిలిప్పీ 3:20).

-జాన్‌స్టేసీ

## ప్రసంగమాలిక "ఎస్తేరు"

పరిచయం

- పాత నిబంధనలో ఎస్తేరు గ్రంధము అందమైన గ్రంధము.
- సాహసోపేతమైన ప్రేమకథ నవలగా చదువరులు దీనిని ఇష్టపడుదురు. మరియు ఉత్కంఠ గ్రంధము.
- ఇండియాను గూర్చిఇందులో రెండుసార్లు సంబోధించబడినది.
- "దేవుడు" అను పదము లేక ఆరాధన లేక పరలోకము లేక నరకమును గూర్చి ఏమియు వ్రాయబడలేదు. ఎటువంటి మత సంబంధమైన విషయములను గూర్చి కూడా తెలుపబడలేదు.
- ఎస్తేరు గ్రంధము బైబిలులో ఎందుకు ఉంచబడెనో మనకు ఆశ్చర్యము కలిగించును. మార్టిన్ లూథర్ ఈ గ్రంధమును తిరస్కరించెను.

- ఏది ఏమైనా తన ప్రజలకు దేవుని కాపుదలను ఇది బయలుపర్చు చున్నది.
- నాటకీయమైన పరిస్థితుల మధ్య ఎస్తేరు పర్షియా యొక్క రాణిగా చేయబడెను.

### ఎస్తేరు అను పేరు

- హదస్సా అనునది ఆమె యొక్క హెబ్రీనామము. దీని అర్థం పరిమళ వాసన గల పుష్ప వృక్షము.
- ఎస్తేరు అనునది పెర్షియ నామము దీని అర్థం "దాచబడిన సంగతి".
- దేవుడు అనుమాట యిందులో కనబడనప్పటికి కొన్నిచోట్ల ఆయన తన్నుతాను బయలు పరచుకొనెను.
- పాత నిబంధన అంతయు మనకు బోధకలుగు నిమిత్తం వ్రాయబడినది (1కొరింథి 10:11, రోమా 15:4).
- ఎస్తేరు గ్రంథము నుండి మనము చాలా పాఠములు నేర్చుకొనగలము.
- ఈ గ్రంథములో కనబడుం నలుగురు ప్రముఖమైన వ్యక్తులు రాజు, రాణియైన ఎస్తేరు, మొర్దెకై మరియు హామాను.

### ఈ గ్రంథములో మరుగు చేయబడిన కొన్ని విషయములు

- దేవుడు లేక యెహోవా అను మాట దీనిలో కనబడనప్పటికి "YHWH" అను పదము హెబ్రీ కోడ్ అయిన E.D.L.Sలో దీనిలో వ్రాయబడెను.
- ఈ కథలో ప్రతి అడుగులోను దేవుని హస్తమును మనము చూడ గలము.

### ఎస్తేరు యొక్క గుర్తింపు మరుగు చేయబడినది

- రాజైన నెబుకద్నెజరు చేత బబులోనుకు చెరగా తీసుకొని రాబడిన యూదులలో ఈమె ఒకతె.
- యూదులు తిరిగి తమ స్వదేశమునకు వెళ్ళుటకు కోరెషు అనుమతి ఇచ్చినపుడు ఆమె తన పినతండ్రి

యైన మొర్దెకైతో బబులోనులోనే ఉండిపోయెను.

- ఆమె అనాధ కాని మొర్దెకై చేత ఆమె దత్తతో తీసుకొనబడినది.
- రాణిగా ఎన్నిక చేయబడిన సందర్భములో తనను గూర్చిన గుర్తింపును చెప్పవద్దని మొర్దెకై ఆమెతో చెప్పెను (ఎస్తేరు 2:10).

**మొర్దెకై యొక్క గుర్తింపు మరుగు చేయబడినది.**

- రాజు యొక్క ఏదో యొక ఉద్యోగిగా ఉండి, ద్వారము దగ్గర ఉండెను.
- హామానుకు ఎందుకు వంగి నమస్కరించుట లేదని అడుగబడినపుడు నేను యూదుడను అని అతడు బయలుపరచుకొనెను (ఎస్తేరు 3:1-4).

**హామాను గుర్తింపు దాచబడినది**

- ఇతడు అమాలేకీయుడు
- ఇతడు అగాగీయుడు (ఎస్తేరు 3:1)
- అగాగు సంతతివాడు (1 సమూయేలు 15:20).
- అమాలేకీయులు ఎదోము (ఏసావు) యొక్క సంతతివారు (ఆదికాండం 36:9-12).
- ఇశ్రాయేలీయులు ఐగుప్తు నుండి స్వతంత్రులై వచ్చి, రెఫిదీములో దిగినపుడు అమాలేకీయులు మొదటిసారి ఇశ్రాయేలీయులతో యుద్ధము చేసిరి (నిర్గమ 17:8-14).
- అమాలేకీయులను భూమి మీద నుండి తుడిచివేయుదునని ప్రభువు ప్రతిజ్ఞ చేసెను (నిర్గమ 17:14).

**దేవునికిని అమాలేకీయులకు మధ్య యుద్ధము దాచబడినది**

- అమాలేకీయులను నాశనం చేయుమని మరియు వారిని పూర్తిగా తుడిచివేయుమని ప్రభువు సౌలురాజుకు ఆజ్ఞాపించెను (1సమూ15:2-3)
- అయితే సౌలురాజు అగగు రాజును ప్రాణముతో పట్టి తెచ్చెను.

- హామాను అగగు సంతతివాడు (ఎస్తేరు 3:11).
- మొర్దెకై ఒక బెంజ్యామీనీయుడు మరియు సౌలు రాజు యొక్క సంతతివాడు (1సమూ 9:1,2).
- దావీదు అబ్షాలోము నుండి పారి పోయినపుడు ఏ షిమీ అయితే దావీదును శపించెనో ఆ షిమీ యొక్క కుమారుడు మొర్దెకై (2సమూ 16:5-13).
- మొర్దెకై హామానుకు వంగి నమస్క రించుటకు తిరస్కరించెను. గనుక హామాను అసూయతో మొర్దెకైను చంపుటకు ఆలోచించెను (ఎస్తేరు 3:2-4).

**మొర్దెకై:-** అనగా ఒక చిన్న మనిషి, సౌలు చేయకుండ వదిలివేసిన పనిని ఇతడు సంపూర్తి చేసెను.

**దేవునికి సాతానుకును మధ్య యుద్ధము దాచబడినది**

- మొర్దెకై తనకు మ్రొక్కాలని హామాను అనుకొనెను.
- క్రీస్తు తనకు మ్రొక్కాలని అపవాది అనుకొనెను (లూకా 4:5-8).
- చివరకు దేవునిదే విజయము.

**నాశనమునకు ముందు గర్వము నడుచును (సామెతలు 11:2; 16:18).**

- హామాను రాజుచేత హెచ్చించ బడెను. తనకు తాను గొప్పవాడ నని తలంచెను. రాణి విందుకు పిలిచినందుకు ఎక్కువగా సంతోషించెను.
- అతని భార్య యూదులను గూర్చి అతని హెచ్చరించెను (ఎస్తేరు 7:14).

**మనుష్యుడు ఏమి విత్తునో దానినే కోయును (గలతి 6:7,8).**

- మొర్దెకైని వ్రేలాడదీయుటకు ఉరి కొయ్యను హామాను సిద్ధంచేసెను (ఎస్తేరు 6:1-16).
- వెనుక దేవుడు పనిచేసెను.

**ప్రజలను రక్షించుటకు నీవు జీవితములో రిస్క్ (గండము)ను ఎదుర్కొనాలి.**

- ఎస్తేరు అదే చేసినది (4:10-17)
- ప్రార్ధనతోను, ఉపవాసంతోను

- ఎస్తేరు మొదట దేవుని యొద్దకు వెళ్ళెను.
- తదుపరి రాజసముఖమునకు ఆమె వెళ్ళెను.

**శరీరాశలను సిలువ వేయవలెను**

- ఎస్తేరు హామాను యొుక్క పదిమంది కుమారులను కనుగొని వారిని ఉరితీయించెను. వారి పేర్ల యొక్క అర్ధములు శరీరాశాలు.
- మనము శరీరాశలను సిలువ వేయ వలెను (కొలస్స 3:5-6).

**ముగింపు :**

ఎస్తేరు నుండి చాల పాఠములు నేర్చుకొనవచ్చును.

- దేవుడు కనబడడు, అయితే తన ప్రజలను రక్షించుటకు ఆయన పనిచేయును.
- చెడు మీద మంచికి విజయమును పండుగ చేసుకుందాం.

**-జాషువా గూటం**

# అపవాది సర్వజ్ఞానియా?

అపవాది సర్వజ్ఞాని కాదు, సర్వజ్ఞాని కాజాలడు. 1కొరింథీ 2:6-8 ఇట్లు చెప్పుచున్నది. “పరిపూర్ణులైన వారి మధ్య జ్ఞానము బోధించుచున్నాము. అది యీలోక జ్ఞానము కాదు. నిరర్థకులైపోవుచున్న యీలోకాధికారుల జ్ఞానమును కాదు గాని దేవుని జ్ఞానము మర్మమైనట్లుగా బోధించుచున్నాము. ఈ జ్ఞానము మరుగై యుండెను. జగదుత్పత్తికి ముందుగానే దీనిని దేవుడు మన మహిమ నిమిత్తము నియమించెను. అది లోకాధికారులలో ఎవనికి తెలియదు, అది వారికి తెలిసి యుండిన యెడల మహిమాస్వరూపుడగు ప్రభువును సిలువ వేయకపోయి యుందురు”

క్రీస్తును ద్వేషించి చంపించిన వారి వెనుకయున్న బలమైన శక్తి అపవాదియనుటలో సందేహము లేదు.

ఆయనను గూర్చిన సత్యము వారికి తెలిసియుంటే క్రీస్తును సిలువవేసి యుండకపోదురు అని పౌలు చెప్పుచున్నాడు. దీనిని ఒక క్షణము ఆలోచించుము. మానవు లందరు రక్షింపబడే ఒకే ఒక్క విధానము క్రీస్తు యొక్క పాపపరి హారార్థబలియే. మానవులందరి దరపున క్రీస్తు తన్నుతాను అప్పగించు కొన్నారు. అపవాదికి ఈ సంగతి తెలిసి యుంటే, వాని శక్తినంతటిని వినియోగించి ఆయన సిలువ మరణమును ఆపు చేయించి యుండును.

హెబ్రీ 2:14, 15ను కూడ గమనించుము: "కాబట్టి ఆ పిల్లలు రక్తమాంసములుగల వారైనందున ఆ ప్రకారమే మరణము యొక్క బలము గలవానిని అనగా అపవాదిని మరణము ద్వారా నశింపజేయుట కును, జీవితకాలమంతయు మరణ భయముచేత దాస్యమునకు లోబడిన వారిని విడిపించుటకును ఆయన కూడ రక్తమాంసములలో పాలివాడా యెను".

తన మరణ, సమాధి పునరుత్థానముల ద్వారా యేసు అపవాది యొక్క బలమును నాశనం చేసేసారు. అపవాది గనుక సర్వజ్ఞానియైతే ఈ సంగతిని ముందుగనే ఎరిగి యుండే వాడు మరియు ఆయన సిలువ వేయ బడకుండా అడ్డుకొనేవాడు.

మరియు అపవాది సర్వజ్ఞాని యైతే మనము దేవుని చెంత చేరకుండా శోధిస్తుయుండేవాడు. గతంలో వానికి యేది పని చేసెనో దానినే వాడు వినియోగిస్తాడు. గాని ఆ ప్రత్యేక శోధనను జయించుట యెట్లో మన మెరిగియున్న యెడల, వాడు మన యొద్ద నుండి పారిపోవును, ఇంకొక అస్త్రమును ప్రయోగించును. "కాబట్టి దేవునికి లోబడి యుండుడి, అపవాదిని ఎదిరించుడి అప్పుడువాడు మీ యొద్ద నుండి పారిపోవును. దేవుని యొద్దకు రండి అప్పుడాయన మీ యొద్దకు వచ్చును" (యాకోబు 4:7-8).

-క్లిఫ్ఫర్డ్ హేమిల్టన్

# సమస్తమైన ఆదరణ నిచ్చు దేవుడు

"కనికనరము చూపుతండ్రి, సమస్తమైన ఆదరణనిచ్చు దేవుడు, ప్రభువైన యేసుక్రీస్తు తండ్రియునైన దేవుడు స్తుతింపబడునుగాక. దేవుడు మమ్మును ఏ ఆదరణతో ఆదరించుచున్నాడో ఆ ఆదరణతో ఎట్టిశ్రమలలో ఉన్నవారినైనను ఆదరించుటకు శక్తి గలవారమగునట్లు ఆయన మా శ్రమ అంతటి యందును మమ్మును ఆదరించుచున్నాడు" (2కొరింథీ 1:3,4).

ఆదరణ అవుసరంలేని వారెవరున్నారు? బాధలు, శోధనలు, అనారోగ్యము, నిరాశ, నిస్పృహ మొదలగునవెన్నో...ఈలిస్టు పెద్దగానే యుంటాది. ఆదరణకు ఆధారభూతుడు అంతా దేవుడే యని మనం ప్రాముఖ్యముగా గుర్తించాలి. ఆయాదరణను దేవుడెట్లు అనుగ్రహిస్తారో కూడ తెలిసికొనుట ముఖ్యము. దేవుడేదో అద్భుతంజేసి సహాయం చేస్తారని అనేకులు తలంచుదురు. అట్లుగాక దేవుడు మామూలు పద్ధతులలోనే సహాయం చేయును.

రెండవ కొరింథీ 2వ అధ్యాయములోని మిగతా భాగము దేవుడు సహాయాన్ని ఎట్లు ఇస్తారో తెలియజేయుచున్నది.

**యితరులకు కలుగు శ్రమల వలన :** "మేము శ్రమపొందినను మీ ఆదరణ కొరకును, రక్షణకొరకును పొందుదుము" (6వ). నీవెంత బాధపడుచున్నావో నేనెరుగుదును అని ఎవరైనా మనకు చెబితే గొప్ప ఆదరణ కలుగును కదా! మొదటి శతాబ్దపు క్రైస్తవులు గొప్ప హింసను ఎదుర్కొనిరి. కలిసి అనుభవించిరి, సహించిరి. ఒండొరుల నుండి ఆదరణపొందిరి.

**యితరుల ప్రార్థనలు :** "ఆయన అట్టి గొప్ప మరణము నుండి మమ్మును

తప్పించెను. ఇకముందుకును తప్పించును. మరియు మా కొరకు ప్రార్థన చేయుటవలన మీరు కూడ సహాయము చేయుచుండగా ఆయన ఇక ముందుకును మమ్మును తప్పించునని ఆయన యందు నిరీక్షణ గలవారమై యున్నాము" (10వ) ఏలయనగా "నీతిమంతుని విజ్ఞాపన మన:పూర్వకమైనదై బహుబలముగలదై యుండును" (యాకోబు 5:16). మన దరపున నీతిమంతులైన క్రైస్తవులు ప్రార్థన చేయుచున్నారని తలంచుట చాల ఆదరణకరము.

**దేవుని వాగ్దానములు:** "దేవుని వాగ్దానములు ఎన్నియైనను అన్నియు క్రీస్తునందు అవునన్నట్టుగానే యున్నవి" (20వ). దేవుని వాగ్దానములను అవునన్నట్టుగా యేసు ఈ లోకము నకవతరించారు. "క్షణమాత్రముండు మా చులకని శ్రమ మాకొరకు అంతకంతకు ఎక్కువగా నిత్యమైన మహిమాభారము కలుగుజేయు చున్నది" (2 కొరింథీ 4:17,18).

శారీరక, మానసిక, ఆత్మీయ శ్రమలు యదార్థము. శ్రమల మధ్య ఆదరణ కొరకు ఎదురుచూచుట సహజము. ఈ ఆదరణయేగాక సమస్త ఆదరణ నిచ్చుదేవుడు దానినెట్లు అనుగ్రహించునో తెలిసికొనుట ముఖ్యము.

**-దేవిడ్ డిఫెన్‌బాగ్**

## నా మాట అగ్నివంటిది కాదా?

"నామాట అగ్నివంటిది కాదా? బండను బద్దలు చేయుసుత్తెవంటిది కాదా?"యని యిర్మియా 23:29లో యెహోవా దేవుడు చెప్పుచున్నాడు.

దేవుని వాక్యమైన బైబిలు అనేక విధములుగా అగ్నివలె యున్నది. వాతావరణం చాలా చలిగా యున్నప్పుడు వేడిని సుఖాన్ని కలిగించ

డానికి అ ... ము. అట్లే మనకు బాధ కలిగినప్పుడు బైబిలు మనకు నెమ్మది కలుగజేస్తొది. దావీదు ఇట్లు చెబుతున్నాడు: "నీ వాక్యము నన్ను బ్రతికించి యున్నది. నా బాధలో ఇదే నాకు నెమ్మది కలిగించుచున్నది" (కీర్తన 119:50).

చీకటిలో వెలుగు నిచ్చుటకు మనము అగ్నిని రాజబెట్ట వచ్చును. పాపపు చీకటిని పారద్రోలే వెలుగు దేవుని వాక్యము. యేసుప్రభువు ఇట్లు చెప్పారు. "ఆతీర్పు ఇదే వెలుగు లోకములోనికి వచ్చెను, గాని తమ క్రియలు చెడ్డవైనందున మనుష్యులు వెలుగును ప్రేమింపక చీకటినే ప్రేమించిరి. దుష్కార్యము చేయు ప్రతివాడు వెలుగును ద్వేషించును. తన క్రియలు దుష్క్రియలుగా కనబడ కుండునట్లు వెలుగునొద్దకురాడు. సత్యవర్తనుడైతే తన క్రియలు దేవుని మూలముగా చేయబడి యున్నవని ప్రత్యక్షపరచబడునట్లు వెలుగునొద్దకు వచ్చును" (యోహాను3:19,20).

బైబిలు మనకు మార్గాన్ని చూపిస్తుంది. "నీ వాక్యము నా పాదములకు దీపమును నాత్రోవకు వెలుగు నై యున్నది" (కీర్తన119:105).

పవిత్రపరచి పరిశుద్ధ పరచుటలో దేవుని వాక్యము అగ్నివలె యున్నది. కలుషితమైనవి కరగిపోవు నట్లు ప్రశస్తపదార్థములు పుటము వేయబడ్డాయి. మన జీవితాల్లో పాపము పై బైబిలు యొక్క ప్రభావం అట్టిదే. "నేను మీతో చెప్పిన మాటను బట్టి మీరిప్పుడు పవిత్రులై యున్నారు" (యోహాను 15:3).

అవును దేవుని వాక్యము అగ్ని వంటిందే. అది మనకు ఆదరణ నిచ్చును. త్రోవకు వెలుగు చూపును. పాపము నుండి మనలను పవిత్రులుగా చేయు బైబిలు కొరకు దేవుని వందనములు.